క్లుప్తంగా

బాలల హక్కులు పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని డీఎస్పీ రవిబాబు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం పట్టణంలో ఆర్డీటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భారతి, అరుణ, సుధారాణి, కాసింబీ, రామాంజినమ్మ, ఓబుళమ్మ, న్యాయ విద్యార్థి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మెట్టు విశ్వ

రాయదుర్గం: కూటమి ప్రభుత్వ అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుద్దామని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి కి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విశ్వనాథ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అందరం కృషి చేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేసే ప్రతి అడుగూ ప్రజల పక్షాన మాత్రమే ఉండాలన్నారు. కేవలం ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందని, సూపర్‌సిక్స్ హామీలు గాలికొదిలిన విషయాన్ని గుర్తుచేసే బాధ్యత తీసుకోవాలన్నారు.

ఫిర్యాదులొస్తే చర్యలు

కూడేరు: సచివాలయ ఉద్యోగులపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి హెచ్చరించారు. మంగళవారం ఆయన కరుట్లపల్లిలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను, అక్కడ అందిస్తున్న సేవలకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి, పంచాయతీ కార్యదర్శి హరి పాల్గొన్నారు.

పశుగణన వేగవంతం చేయండి

ఉరవకొండ: పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో అఖిల భారత పశుగణన సర్వేను విజయవంతం చేయాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ సూచించారు. మంగళవారం డివిజన్ పరిధి లోని బెళుగుప్ప, ఉరవకొండ మండలాల్లో జరుగు తున్న పశుగణన సర్వేను డిప్యూటీ డైరెక్టర్ పర్య వేక్షించారు. డీడీ మాట్లాడుతూ ఉరవకొండ డివిజన్ లోని 14 మండలాల్లో పశు గణనకు పశు వైద్యులను సూపర్ వైజర్లుగా నియమించామన్నా రు.

కల్వర్టుకు మరమ్మతులు పూర్తి



పూర్తయిన రోడ్డు, కల్వర్టు పనులు

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లి, బండూరు రోడ్డు, కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేదావతి హగరి నది ఉధృతంగా ప్రవహించి కోతకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఉరవకొండ, దర్గాహొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం, కల్‌హోళ, వన్నల్లి, హోసల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 'కష్టాలు దాటించే దారే లేదా?' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు రూ.40లక్షలతో కల్వర్టు,రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. మంగళవారం నాటికి పనులను పూర్తయ్యాయి.

తపాలా ఉద్యోగి ఆత్మహత్య



రామాంజి నేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం: మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన తపాలా ఉద్యోగి రామాంజినేయులు (48) ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన రామాంజినేయులు ఈ నెల 17 నుంచి కనిపించకుండా పోయాడు. ఆయన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విస్తృత గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గం మండలం హులికల్లు కొండలో ఆయన మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మానసిక ఒత్తిళ్లు తాళలేక ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

21న ధ్వజ స్తంభం ప్రతిష్ట

కూడేరు: మండల పరిధిలోని కలగళ్లలో ఈ నెల 21న అయ్యప్ప స్వామి ఆలయం ముందు ధ్వజ స్తంభం ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు.



ఉరవకొండలోని గిరిజన బాలికల వసతి గృహానికి ప్రహరీ లేని దృశ్యం

ఇది ఉరవకొండ పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహం. ఇందులో 500 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. ప్రహరీ లేదు. ఆకతాయిలు హాస్టల్ ముందు కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనంలేదు. గిరిజన విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.



ఉరవకొండ గురుకుల పాఠశాలలో భోజనం కోసం క్యూలో నిల్చున్న విద్యార్థినులు

ఈ చిత్రం ఉరవకొండలోని అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల. మొత్తం 800 మంది విద్యార్థినులకు వండే భోజనం నాణ్యతగా లేదు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నా ముద్దన్నం, నీళ్లపప్పుచారు, రసం, మజ్జిగ వడ్డిస్తున్నారు. విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



బెళుగుప్ప బీసీ బాలుర వసతి గృహంలో నీళ్ల చారు వండిన దృశ్యం

ఈ చిత్రంలో బెళుగుప్పలోని బీసీ బాలుర వసతి గృహంలోనిది. వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా నిత్యం నీళ్లచారు, ముద్దన్నం, కుళ్లిన కూరగాయలతో పప్పు వడ్డిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిగో ఇక్కడ బురద మయంగా కనిపిస్తున్న పాఠశాల కంబదూరు మండలం తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాల. ఇక్కడ 676 మంది బాలికలు 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండింది. దీనికి తోడు బాలికలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది వినియోగించే మరుగుదొడ్లు, వంట గదుల నుంచి వచ్చే మురుగునీరు ఆవరణలోనే నిలిచి, దుర్వాసన వస్తోంది. అపరిశుభ్రతతో చాలా మంది విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతున్నారు.



తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం

సమస్యలతో సహవాసం

అంతా సంక్షామమే

- సౌకర్యాలు కొరవడి విద్యార్థుల అవస్థలు
- స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వానం
- దుప్పట్లు లేక చలికి వణికిపోతున్న వైనం
- బాలికల హాస్టళ్ల వద్ద నిఘా వైఫల్యం



కుందుర్పిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఒకే గదిలో ఇరుకుగా విద్యార్థులు ఉన్న దృశ్యం



ఇరుకు గదిలో ట్రంకు పెట్టెల నడుమ విద్యార్థుల అవస్థలు

రాయదుర్గం/కళ్యాణదుర్గం/ఉరవకొండ: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ఎస్సీ,బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాల్లోనూ కనీస సౌకర్యాలులేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. పేద పిల్లల చదువులకు పెద్దపీట వేయాల్సిన కూటమి సర్కారు.. నిర్లక్ష్యం చూపుతోంది. దీంతో పేద పిల్లల చదువు కుంటుపడుతోంది. కొన్నిచోట్ల స్నానపుగదులు, మరుగుదొడ్లు సరిగా లేవు. తాగునీటి వసతిలేదు. వాకిళ్లు, కిటికీలకూ తలుపులు సరిగా లేవు. దోమల బెడద ఉంది. రాబోయే రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుంది.. కనీసం చలికాలంలో కప్పుకునేందుకు దుప్పట్లు లేక వణికిపోతున్నారు. బాలికల వసతి గృహాల వద్ద ప్రహరీలు లేవు. రక్షణ కరువైంది. బాలికల వసతి గృహాల వద్ద నిఘా వైఫల్యం కనిపిస్తోంది. ఇలా ఎన్నో సమస్యలు 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో వెలుగుచూశాయి.

రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్, డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో గురుకుల, ఎంజేపీ, కేజీబీవీ, ప్రభుత్వ సంక్షేమ ఎస్సీ, బీసీ వసతి గృహాలు 17 ఉన్నాయి. వీటిలో సుమారు నాలుగువేల మంది వసతి పొందుతున్నారు. కణేకల్లు బీసీ వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు దుస్థితికి చేరుకున్నాయి. ఆరుబయటే స్నానం చేయాల్సి వస్తోంది. బహిర్భూమికి పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. రాయదుర్గం పట్టణంలో ఆరు సంక్షేమ వసతి గృహాలుండగా మూడు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. బీసీ బాలికల కళాశాల హాస్టల్, బాలుర కళాశాల హాస్టళ్లలో వసతులు లేవు. మరగుదొడ్లు, స్నానపు గదుల్లేవు. బొమ్మనహాళ్‌లో బీసీ బాలుర వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్నానపు గదులు లేవు. సరిపడా మరుగుదొడ్లులేవు. గుమ్మఘట్టలో మహాత్మా జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో 320 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇరుకుగదులు, సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లులేరు. డి హీరేహాళ్ వసతి గృహంలోనూ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఏపీ గురుకుల, సంక్షేమ వసతి గృహాలు మొత్తం 12 ఉండగా అందులో మొత్తం 2,555 మంది విద్యార్థినీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం 8 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో ఐదు బాలురు, మూడు బాలికల వసతి గృహాలు. కేవలం బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఏడుగురు సంక్షేమ వసతి గృహాల అధికారులు ఉండాల్సి ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. క్లాస్ 4 ఉద్యోగులు 23 మంది పని చేస్తున్నారు. జూలై నుంచి ఇప్పటివరకు దాదాపుగా రూ.45 లక్షల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నియోజకవర్గంలో ఏపీ గురుకుల, సంక్షేమ వసతి గృహాలు మొత్తం 13 ఉండగా అందులో 2,805 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇప్పటికీ బాలురు ఆరుబయటే బహిర్భూమికి వెళ్లే పరిస్థితి ఉంది. ఒక్కో తరగతిలో 40 మంది ఉండాల్సి ఉండగా 57 మంది వరకు సర్దుకుపోవాల్సి వస్తోంది. ట్రంకు పెట్టెలు, సామాన్లతో గది ఇరుకుగా ఉంటోంది. జూలై నెల నుంచి రూ.45 లక్షలు డైట్ బిల్లులు రాలేదు. వార్డెన్లు అప్పు చేసి వసతి గృహాలను నడిపిస్తున్నారు. అరకొర భోజనంతోనే అవస్థలు పడుతున్నారు.

మినరల్ వాటర్‌కు బదులు బోరుబావి నీళ్లు వాడుతున్నారు.

ఉరవకొండ ఎస్సీ బాలికల నం.1 వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికే వసతి గృహంలోని అన్ని గదులు కారుతున్నాయి. విద్యార్థినులు వరండాలో నిద్రించాల్సి వస్తోంది. మరుగుదొడ్లకు సరైన తలుపులు లేవు. ఒకే బాత్‌రూమ్‌నే 40 మంది వినియోగించుకోవాలి. హాస్టల్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రివేళలో రక్షణ కరువైంది. 150 పైగా విద్యార్థినులు ఉండే వసతి గృహంలో కేవలం 40 మంది మాత్రమే ఉంటున్నారు. ఉరవకొండలోని ఇంద్రానగర్ వద్ద ఉన్న బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి పైకప్పు కూలడానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ 40 మంది విద్యార్థులు ఉన్నారు. విడపనకల్లు బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్ పర్యవేక్షణ లేక విద్యార్థినులకు భద్రత కరువైంది. వార్డెన్ వారానికి రెండు సార్లు చుట్టుపు చూపుగా వస్తున్నారు. నాసిరకం భోజనం వడ్డిస్తున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. కూడేరులోని బీసీ బాలికల వసతి గృహంలో 60 మంది విద్యార్థినులున్నారు. హాస్టల్‌లో రక్షణ కరువైంది. వసతి గృహానికి రక్షణ గోడ ఎత్తుగా లేక బయట వ్యక్తులు గోడపై నుంచి దొరబడే అవకాశం ఉంది. బెళుగుప్ప మండలంలోని వెంకటాద్రిపల్లిలోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉండగా, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మోటారు మరమ్మతు చేయకపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉంది. వార్డెన్ నిర్లక్ష్యంతో తాగునీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వజ్రకరూరులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో 170 మంది విద్యార్థినులకు కేవలం రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. డైనింగ్ హాల్ లేదు. ఆరుబయటే భోజనం చేస్తున్నారు. వార్డెన్ కూడా వారానికోసారి వచ్చి వెళ్తున్నారు.

అన్నీ సమస్యలే..



టాయిలెట్స్ నిరుపయోగంగా ఉండటంతో రాత్రి పూట అత్యవసరమైతే బయటికి వెళుతున్నాం. చుట్టు పక్కల వరిపొలాలున్నాయి. దీంతో నిత్యం ఇక్కడ పాములు, తేళ్లు, జర్రిలు లాంటి విష పురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి బయటికి రావాలంటే భయమేస్తోంది. మరుగుదొడ్ల సమస్య తీర్చాలి.

– యోహోనా, 10 వ తరగతి కణేకల్లు

అవస్థలు పడుతున్నాం



వసతి గృహంలో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒకే గదిలో 40 మంది ఉండాల్సి ఉండగా మా గదిలో ఏకంగా 55 మంది వరకు ఉంటున్నాం. ఇరుకుగా ఉండి చదువుకునేందుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. వసతి గృహాల్లో సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

– మనోజ్, 10 వ తరగతి విద్యార్థి, జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, కుందుర్పి



బొమ్మనహాళ్ బీసీ హాస్టల్‌లో పెచ్చులూడుతున్న దృశ్యం



ఉరవకొండ ఎస్సీ బాలికల వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేని దృశ్యం

కడ్లే గౌరీదేవికి చక్కెర హారతులు



పెన్నానదిలో పెద్దమ్మ దేవత విగ్రహంతో గంగపూజ చేస్తున్న దృశ్యం



గోవిందవాడలో చక్కెర హారతులు తీసుకెళ్తున్న మహిళలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ, కల్‌హోళ, బొల్లనగుడ్డం గ్రామాల్లో కడ్లే గౌరీదేవికి మహిళలు మంగళవారం రాత్రి చక్కెర హారతులు సమర్పించారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద ఆవిష్కరించిన కడ్లే గౌరీదేవికి యువతులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చి చక్కెర హారతులు ఇచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజామున కడ్లే గౌరీ దేవి ఊరేగింపు ఉంటుంది. అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

కనులపండువగా గౌరమ్మ జాతర

బ్రహ్మసముద్రం : మండలంలోని పోలేపల్లి గ్రామంలో గౌరమ్మ జాతర ఆఖరి రోజు కనులపండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు భక్తులు గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం గౌరీదేవి ఉత్సవాలు ముగిశాయి.



కడ్లే గౌరిదేవి

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో రెండురోజులుగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట హోమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని పెన్నానదిలో చరప్రతిష్టా విగ్రహానికి గంగపూజ చేశారు. బుధవారం తెల్లవారుజామున 4.15 నుంచి 5.15 గంటల మధ్య విగ్రహ ప్రతిష్ట, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధనోత్సవాలు

బొమ్మనహాళ్: ప్రముఖ దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో మొదటి దీపారాధనోత్సవాలు నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూలమాలలు సమర్పించి, చక్కెర చదివింపులు చేశారు. బుధవారం రెండో దీపారాధన జరుగుతుందన్నారు. సర్మాస్ హుసేనీ స్వామి దర్గాను రాష్ట్ర ముతవల్లి కమిటీ అధ్యక్షుడు షకీల్ షఫీ మంగళవారం దర్శించుకున్నారు. దర్గా ముతవల్లి రహమతుల్లా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

బొమ్మనహాళ్: కల్లుహోళకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాల్తూరు వీరన్న (33) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, సర్పంచ్ వీరన్నగౌడ్, ఎంపీటీసీ వంశీలు కల్లుహోళలో వీరన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

రూ.50 లక్షలు విలువజేసే స్థలం అన్యాక్రాంతం

ఉరవకొండ: స్థానిక రాములమ్మ గుడి వద్ద 42 జాతీయ రహదారి వద్ద అనంతపురం రోడ్డు వైపు సర్వేనం. 542లో విలువైన రెవెన్యూ స్థలం అన్యాక్రాంతమైంది. ఐదు సెంట్లు విలువ చేసే ఈ స్థలం బహిరంగ మార్కెట్లో రూ.50 లక్షలు వరకు పలుకుతోంది. ఇలాంటి స్థలాన్ని టీడీపీ నేతల అండతో ఏకంగా ఓ వ్యక్తి ఆక్రమించి, ఇంటి నిర్మాణం చేపట్టాడు. అక్రమంగా చేపడుతున్న ఇంటి నిర్మాణ పనులు వెంటనే ఆపాలని మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ నోటీసు జారీ చేసినా ఖాతరు చేయలేదు. ' నీకు మేమున్నాం.. ఏ అధికారి అడ్డు చెప్పినా మామీద చెప్పు' అని కొందరు టీడీపీ నాయకులు సదరు వ్యక్తికి భరోసా ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. తహసీల్దార్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ రెవెన్యూ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. రాములమ్మ గుడి వద్ద రెవెన్యూ స్థలం ఎంత ఉందో కొలతలు వేసి, అక్రమంగా నిర్మించిన కట్టడంపై చర్యలు తీసుకుంటామన్నారు.



జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రెవెన్యూ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

నేమకల్లు భూముల పరిశీలన

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూములను ఆర్డీఓ వసంతబాబు మంగళవారం పరిశీలించారు. ఇటీవల 35 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ, జువాలజీ అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రంలో ఎంఎస్‌ఈ అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు బొడ్డురాయి వద్ద పాట్‌హోల్ ప్యాచ్ వర్క్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మంగళవారం పరిశీలించారు. పట్టణంలో ప్యాచ్ వర్క్ మరమ్మతు పనులకు రూ.6 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. 2వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, అమినిటీ సెక్రటరీ బేబీ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

కూడేరు: సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకొని పిల్లలకు విద్యా బోధన చేయాలని ఎంఈఓ మహమ్మద్ గౌస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ మహమ్మద్ గౌస్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించారు. ఎంఈఓ-2 సాయికృష్ణ , పాఠశాల కాంప్లెక్స్ చైర్‌పర్సన్ శ్రీదేవి, సీఆర్పీలు శివ, ఆదిలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

కంబదూరు: విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యంబాబు సూచించారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు శాంతమ్మ, మానస, నజీయ, కర్మిష, వనిత, రేష్మ, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉరవకొండ: స్థానిక గ్రంథాలయ శాఖలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనధికారిక వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోండి

రాయదుర్గంటౌన్: పట్టణంలో విచ్చలవిడిగా వెలిసిన అనధికారిక తాగునీటి శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయ కులు దుర్గన్న, గోవిందు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదాం

రాయదుర్గంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిలదీద్దామని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయక కార్యదర్శి బీహెచ్ రాయుడు అన్నారు. ఈ నెల 26న జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరిగే మహా ప్రదర్శనల కార్యక్రమ పోస్టర్లను ఎఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసిమంగళవారం విడుదల చేశారు. నాయకులు మధు, నాగరాజు, శంకర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదాం

ఉరవకొండ: ఇంటర్ కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని అర్బన్ ఎస్ఐ జనార్దన్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ర్యాగింగ్, ఈవ్ టీచింగ్‌పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

జీవీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకేపురుషోత్తం అధ్యక్షతన సమావేశం జరిగింది.

పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలి

కూడేరు: పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నేత రమణ కోరారు. మంగళవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందించారు. సీపీఐ మండల నేతలు మలరాయుడు, ధనరాజ్, ముత్యాలన్న, పద్మావతి, ఎర్రెమ్మ, అంజనప్ప పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

గుమ్మఘట్ట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని రంగసముద్రం గ్రామంలో మలేరియా, చికెన్‌గన్యా, డెంగీ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి పాల్గొన్నారు.

పశువుల అపహరణ

గుమ్మఘట్ట: దేవరెడ్డిపల్లి గ్రామంలో ఒక ఎద్దు, మారెంపల్లి గ్రామంలో ఒక ఆవు అపహరణకు గురైనట్లు బాధితులు నాగరాజు, జగదీష్ తెలిపారు. రూ.40 వేల ఎద్దు, రూ.30వేల ఆవును గర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గాదిలింగకు అండగా ఉంటాం

బొమ్మనహాళ్: కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొల్లనగుడ్డం గ్రామ సర్పంచ్ గాదిలింగకు అండగా ఉంటామని ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సర్పంచ్ గాదిలింగను బొల్లనగుడ్డం గ్రామంలో పరామర్శించారు. వైద్యం ఖర్చులకు గాదిలింగకు ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి రూ.10 వేలు అందించారు. పార్టీ తరఫున ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు వీరన్నగౌడ్, వంశీ, నబీసాబ్ పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి

కణేకల్లు: శ్రీగంధం సాగు చేసిన రైతులు చుట్టూ కంచె ఏర్పాటు చేసుకోవాలని రాయదుర్గం సెక్షన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, కణేకల్లు బీట్ ఆఫీసర్ స్వర్ణలత తెలిపారు. మంగళవారం మండలంలోని కణేకల్లు క్రాస్‌లో రైతు కేశవరెడ్డి పొలంలో శ్రీగంధం చెట్ల నరికివేతను ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. తన పొలంలో ఉన్న 15 చెట్లు, మరో రైతుకు చెందిన 5 శ్రీగంధం చెట్లను నరికేసినట్లు రైతు కేశవరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. అధికారులు మాట్లాడుతూ శ్రీగంధం చెట్ల రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాయదుర్గం సివిల్ కోర్టు జడ్జి ఇంటి ఆవరణలో ఉన్న చెట్లను నరికేసిన నిందితులు రిమాండ్‌లో ఉన్నారని, వీరి అనుచరులపై అనుమానంతో గాలిస్తున్నట్లు తెలిపారు.

ముంపు భూముల పరిశీలన

కూడేరు: మండలంలోని ఇప్పేరు చెరువు నీటితో ముద్దలాపురం వైపు ఉన్న భూములు ముంపుకు గురై పంటలు దెబ్బతిన్నాయని రైతులు విశ్వనాథ్ రెడ్డి, మరికొందరు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతులు అందించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ మహబూబ్ బాషా, సర్వేయర్ ఆయూషా సిద్దిక్, ఏఈ సుధాకర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి, భూములను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో ఇమ్రాన్, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.